నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

ఎల్‌బీనగర్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలు ఎలాంటి కోపతాపాలకు పోకుండా శాంతియుతంగా సోదరభావంతో ప్రేమను పంచుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ప్రజలు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

మహాపడి పూజ



హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ హరిత ధన్‌రాజ్‌గౌడ్ ఇంజాపూర్‌లోని తన ఇంటి వద్ద నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడి పూజకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మల్‌రెడ్డి రాంరెడ్డి, మల్‌రెడ్డి యాదిరెడ్డితో పాటు మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు హాజరయ్యారు.



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి

అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని అంటువ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పాపిరెడ్డి కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ స్వచ్ఛ శ్రీ పాపిరెడ్డి కాలనీ కార్యక్రమానికి కార్పొరేటర్ పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలను చెత్తరహిత, పరిశుభ్ర డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఉండాలన్నారు. కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీశైలం, ఉపాధ్యక్షులు బాలునాయక్, ప్రధాన కార్యదర్శి ఆర్.రవినాయక్, సాంబయ్య, మెట్టుపల్లి సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



రమేష్‌గౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి, అఖిల్‌గౌడ్

మాజీ మున్సిపల్ చైర్మన్ సేవలు చిరస్మరణీయం

చంపాపేట, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రమేష్‌గౌడ్ పేద ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయం అని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌కు చెందిన ఆకుల రమేష్‌గౌడ్ మూడవ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఆయన చిత్రపటానికి మధుసూదన్‌రెడ్డి, ఆకుల అఖిల్‌గౌడ్, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్‌గా బీజేపీ తరఫున విజయం సాధించిన రమేష్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేయక ముందే మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఆకుల అఖిల్‌గౌడ్ పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, పాండాల శేఖర్‌గౌడ్, శేఖర్, సందీప్, రాజేష్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, అంజన్‌కుమార్, కృష్ణారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.



గవర్నర్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న గోపాలకృష్ణానందస్వామీజీ

గవర్నర్‌ని సాయి పీఠానికి ఆహ్వానించిన స్వామీజీ

సరూర్‌నగర్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్‌లోని శ్రీద్వారకామాయి సాయిబాబా పీఠాన్ని సంక్రాంతి మాసంలో ఏదో ఒక రోజు సందర్శించాల్సిందిగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన బీజేపీ తమిళనాడు రాష్ట్ర ఇన్‌చార్జి, పార్టీ కోర్ కమిటీ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి రాజ్‌భవన్‌లో ఆమెను కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రం అందజేశారు. దానికి గవర్నర్ సానుకూలంగా స్పందించినట్టు స్వామీజీ తెలిపారు. కార్యక్రమంలో స్వామీజీ తనయుడు లలిత్‌సాయికుమార్ పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో బీఆర్ఎస్ నేత ఫ్లెక్సీ చించివేత

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



నందిహిల్స్‌లో బీఆర్ఎస్ నేత ఫ్లెక్సీని చించేసిన దుండగులు

సరూర్‌నగర్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లోని నందిహిల్స్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి నర్సిరెడ్డి నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన పలు ఫ్లెక్సీ బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. దీనిపై ఆయన మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండ్రోజుల క్రితం నర్సిరెడ్డి సదరు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా, శనివారం రాత్రి 11గంటల ప్రాంతంలో నలుగురు వ్యక్తులు బైకులపై వచ్చి వాటిని చించేసినట్టు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. అయితే ఆ వ్యక్తులు రాజకీయ పార్టీలకు చెందిన వారా.. లేక స్థానికంగా రోడ్లపై తిరిగే చిల్లర వ్యక్తులా అన్నది తేలాల్సి ఉంది. కాగా తాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు నర్సిరెడ్డి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీలను సైతం వారికి అందజేశారు.

దంత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డిపాలెంలోని క్యాండర్ ప్రైస్ ఐ స్కూల్‌లో శ్రీ సాయి డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 2వేల మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసినట్లు డాక్టర్. సుష్మారెడ్డి తెలిపారు. పంటి పరీక్షలతో పాటు నోటి పరిశుభ్రత ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ మల్లారెడ్డి డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు అపూర్వ, హారిక, విరాలి, స్కూల్ వైస్ చైర్మన్ రామయ్య, డైరెక్టర్ రత్నారెడ్డి పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సన్మానం

మలక్‌పేట, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన కోర్టు న్యాయమూర్తుల ఫలితాల్లో మలక్‌పేట వాసి వస్కుల శ్రీనయ్య జిల్లా కోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఆదివారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ ఎస్.జీ.ఎస్ దామోదర్ ఆయనను కలసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ మార్కెట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటా

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్‌బీనగర్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేగా మరోసారి ఎన్నికైన సందర్భంగా బీఆర్ఎస్ సరూర్‌నగర్ డివిజన్ నాయకులు ఆమెను ఆదివారం ఘనంగా సన్మానించారు. సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సబితారెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో చేసిన అభివృద్ధి పనులు, పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఫలితంగానే విజయం సాధించామన్నారు. నాకు వెన్నంటి నిలిచి గెలిపించిన ప్రజలను గుర్తుపెట్టుకుంటానని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బేర బాలకిషన్, మురుకుంట్ల అరవింద్‌శర్మ, బోయిని మహేందర్‌యాదవ్, లోకసాని కొండల్‌రెడ్డి, ఇంటూరి అంకిరెడ్డి, మంచినీళ్ల సుదర్శన్, సలీం, సుశీలరెడ్డి, నర్సింహ, మురళీధర్‌రెడ్డి, జిల్లెల కృష్ణారెడ్డి, రాంనర్సింహగౌడ్ పాల్గొన్నారు.



సబితారెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నేతలు

సబిత గెలుపుతో బీఆర్ఎస్ నేత 'మాతా జాగరణ్'

సరూర్‌నగర్ : మహేశ్వరంలో సబితారెడ్డి గెలిస్తే మాతా జాగరణ్ నిర్వహిస్తానని మొక్కుకున్న జిల్లెలగూడలోని రాఘవనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నేత మాచర్ల అవినాశ్ తన మొక్కు తీర్చుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరవగా అవినాశ్ ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మారేందుకు మరో అవకాశం

● రౌడీషీటర్లకు సీపీ కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : రౌడీ షీటర్లు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని, కొత్త ఏడాది నుంచైనా మారాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు హితవు పలికారు. ఎల్‌బీనగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్ అనే పదం పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తుందని, పిల్లలు వారిని అనుసరిస్తే రౌడీషీటర్లుగా మారతారని, ఇలా జరగకుండా ఉండాలంటే మీరు మారాలన్నారు. మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ప్రతి రౌడీషీటర్‌పై నిఘా

రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందని సీపీ సుధీర్‌బాబు అన్నారు. ప్రత్యేక బృందాల ద్వారా ఎప్పటికప్పుడు కదలికలను గమనిస్తున్నామని, చట్టవ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూకబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం వంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. రౌడీషీటర్ల నుంచి పోలీసులు కోరుకునేది మార్పు మాత్రమేనని, మీ చుట్టూ జరిగే నేరాలపై సమాచారం అందించి సహకరిస్తే పాజిటివ్ షీట్ ఓపెన్ చేస్తామని హామీ ఇచ్చారు. రౌడీషీటర్లు చేసిన మంచి పనులను నమోదు చేస్తామని, పూర్తిగా మార్పు వస్తే రౌడీషీట్ తొలగించే అవకాశముందన్నారు. కార్యక్రమంలో డీసీపీలు జానకీ ధరావత్, రాజేష్ చంద్ర, గిరీధర్, శ్రీనివాస్, మురళీధర్, సాయిశ్రీ పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీపీ సుధీర్‌బాబు



పెద్దఅంబర్‌పేట్‌లోని బోనమ్మ ఆలయంలో అయోధ్య అక్షింతల పూజలో స్థానిక నేతలు



శ్రీరాముని అక్షింతల ఊరేగింపులో కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ అయ్యప్ప ఆలయం నుంచి అయోధ్య రామయ్య అక్షింతలను ఆదివారం పెద్దఅంబర్‌పేట్‌లోని జిమ్మి అంజనేయస్వామి ఆలయానికి తరలించారు. జనవరి 1 నుంచి గడప గడపకు అక్షింతలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్ ముదిరాజ్, నాయకులు పండుగుల రాజు, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి గంట, మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జగన్ పాల్గొన్నారు.

శాలివాహననగర్‌లో..

చాదర్‌ఘాట్ : శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు ఆదివారం ముసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్ కాలనీలో భజన కీర్తనల నడుమ సాగింది. చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, బీజేపీ రాష్ట్ర నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో..

హయత్‌నగర్ : శ్రీరాముడి అక్షింతలు ఆదివారం హయత్‌నగర్ అయ్యప్ప ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయం వద్ద ఆర్ఎస్ఎస్, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు అందజేశారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డిలు అక్షింతలను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్‌లోని రామాలయం వద్ద అక్షింతలను పంపిణీ చేశారు.



హయత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, నర్సింహారెడ్డి

సినీ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం

● కళాకారులకు నంది అవార్డులు నిలిపివేయడం విచారకరం

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరిన కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు

వనస్థలిపురం, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం సినీ రంగాన్ని సుమారు దశాబ్ద కాలం నుంచి నిర్లక్ష్యం చేసిందని, ఇటీవల నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సినీ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కళాకారులకు నంది అవార్డులు ఇచ్చి సినీ రంగాన్ని మరింతగా ప్రోత్సహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు, ప్రముఖ వాస్తు నిపుణులు పి.కృష్ణాదిశేషు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కృష్ణాదిశేషు సినీ ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణాదిశేషు మాట్లాడుతూ దశాబ్దకాలం నుంచి తెలుగు సినీ పరిశ్రమలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కళాకారులను ప్రోత్సహించేందుకు అందజేసే నంది పురస్కారాలు నిలిపివేయడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి నంది పురస్కారాలు అందజేస్తామని పేర్కొనడం అభినందనీయమన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నంది అవార్డుకు బదులుగా తెలంగాణ ఖ్యాతిని పెంచేందుకు కాకతీయ తెలుగు ఫిల్మ్ అవార్డ్స్ పేరిట అవార్డులను ఏర్పాటు చేస్తే బాగుంటుందని మంత్రికి సూచించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని శేషు తెలిపారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న కృష్ణాదిశేషు

రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు

● పరిశీలించిన కార్పొరేటర్

హయత్‌నగర్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హయత్‌నగర్ ఏరియాలోని పలు కాలనీల్లో రోడ్లను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. డివిజన్‌లోని ప్రియదర్శిని కాలనీవాసుల అభ్యర్థన మేరకు ఆదివారం ఆయన కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కబ్జాకు గురవుతున్న రోడ్డు స్థలాలను కాలనీవాసులు కార్పొరేటర్‌కు చూపించారు. కాలనీలో అపార్టుమెంట్లు నిర్మిస్తున్నప్పుడు 30 ఫీట్ల రోడ్లను జీహెచ్ఎంసీ అధికారులకు చూపించి అనుమతులు పొందుతున్నారని తెలిపారు. అపార్టుమెంటు పనులు పూర్తి కాగానే ఓసీ తెచ్చుకుని పక్కనే ఉన్న రోడ్ల ప్రాంతాలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని కార్పొరేటర్ ఆరోపించారు. అపార్టుమెంటు నిర్వాహకుల వల్ల 30 ఫీట్ల రోడ్లు 25 ఫీట్లకు కుదించుకుపోతున్నాయని అన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు అనుమతులు ఇచ్చి తమకు ఏమి సంబంధం లేదనే ధోరణిలో ఉన్నారని తెలిపారు. అపార్టుమెంటు, ఇల్లు నిర్మాణం నిబంధనల ప్రకారం జరుగుతుందా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలించక పోవడంతో అన్ని కాలనీల్లో రోడ్లు కబ్జాకు గురవుతున్నాయన్నారు. కనీసం సెట్ బ్యాక్ లేకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. దీంతో ఇంటి ర్యాంపులు మొత్తం రోడ్ల పైకి వస్తున్నాయని తెలిపారు. ప్రియదర్శిని కాలనీ రోడ్డు నంబర్-1, 6లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే రోడ్లను ఆక్రమించిన అపార్టుమెంట్లను కూల్చి వేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మధుసూదన్‌రెడ్డి, లింగస్వామి, శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకటాచారి, శంకర్‌రెడ్డి, యాదగిరి యాదవ్, శ్రీధర్‌గౌడ్, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రియదర్శిని కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీని కార్పొరేటర్‌కు చూపిస్తున్న కాలనీవాసులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : షేక్ అక్బర్

చాదర్‌ఘాట్ : మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని మలక్‌పేట కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ అక్బర్ పిలుపునిచ్చారు. ఆదివారం మలక్‌పేటలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి గట్టి సంకల్పంతో ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సోహెల్ ఉద్దీన్, నాయకులు ముజమిల్, వరుణ్, అమేర్ మాలిక్, సైఫ్, జోహైబ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హయత్‌నగర్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం కొహెడాలో గోదాంల వద్ద చైర్మన్ సత్తయ్య పాలకవర్గ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, డైరక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సీఈవో రాందాసు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం..

చాదర్‌ఘాట్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం ముసారాంబాగ్ నూతన సంవత్సరం-2024 క్యాలెండర్‌ను ఆదివారం శాలివాహననగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అధ్యక్షుడు అప్పన్న సాంబశివరావు, కోశాధికారి మోటూరి శ్రీనివాసగుప్తా ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. సంఘం ప్రతినిధులు అర్వపల్లి వేణుగోపాల్, పబ్బా యుగెందర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

రెడ్డి సేవాసమితి..

చంపాపేట, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని డిఫెన్స్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం కాలనీ అధ్యక్షుడు అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి హాజరై రెడ్డి సేవాసమితి నూతన సంవత్సరం- 2024 క్యాలెండర్‌ను సేవా సమితి నేతలతో కలిసి ఆవిష్కరించారు. డిఫెన్స్‌కాలనీ, మాధవనగర్‌కాలనీ, దుర్గానగర్‌కాలనీ, లక్ష్మీగణేష్‌నగర్‌కాలనీ, ఎస్‌వీకాలనీ, శ్రీనిధికాలనీ, బైరామల్‌గూడ ప్రాంతాల రెడ్డి సేవా సమితి ప్రతినిధులు హాజరై ప్రతిజ్ఞ చేశారు. గజ్జెల మధుసూదన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, విజయసేనారెడ్డి, జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మణిపాల్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.